క్లుప్తంగా

బూచేపల్లిని కలిసిన బొట్ల సుబ్బారావు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సన్మానిస్తున్న బొట్ల సుబ్బారావు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను దర్శిలోని వారి నివాసంలో పార్టీ బీసీ సెల్ జిల్లా నూతన అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలతో వారిని సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుబ్బారావుకు బూచేపల్లి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఫణిదపు సుధాకర్, కె.కోటి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దిపాడులో వైఎస్ జగన్ జన్మదినోత్సవం

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని శనివారం మద్దిపాడులో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున హాజరవుతున్నారని చెప్పారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కేక్ కటింగ్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ విభాగాల నాయకులు హాజరుకావాలని అప్పారావు కోరారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బధిరుల పాఠశాలలో పండ్ల పంపిణీతో పాటు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ అందిస్తారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి చుండూరి నివాళి



శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న చుండూరి రవి

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పీడీసీసీబీ మాజీ డైరెక్టర్ ఉన్నం శ్రీనివాసరావు శుక్రవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవి పూలమాలతో నివాళులర్పించారు. శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, నాయకులు కంచర్ల సుధాకర్, కోయి హనుమయ్య, కాట్రగడ్డ శ్రీను, కాటూరి ఆదిత్య తదితరులు ఉన్నారు.

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

సంతనూతలపాడు: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సంతనూతలపాడులో స్థానిక హైస్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు. ఎంఈఓ డి.వెంకారెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద, ఉపాధ్యాయురాలు మాధవీలత, పీడీ కె.మల్లికారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

సంతనూతలపాడు: ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పేర్నమిట్ట పీర్లమాన్యం కాలనీలో విద్యుత్ బిల్లులు దహనం చేసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు బంకా సుబ్బారావు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై సుమారు రూ.17 వేల కోట్ల భారం మోపాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కె.కృష్ణారెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పాతర..!

- కూటమి ప్రభుత్వం వచ్చాక జగనన్న ఆరోగ్య సురక్ష రద్దు
- మెరుగైన వైద్యసేవలకు చంద్రబాబు చెల్లుచీటీ
- వైఎస్ జగన్ హయాంలో ఇంటి వద్దే స్పెషలిస్టు వైద్యులతో సేవలు
- ప్రస్తుతం ఆస్పత్రుల చుట్టూ తిరగలేక ప్రజలకు ఇబ్బందులు



చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న రోగులు

ఒంగోలు టౌన్: ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత. నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వారి కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. అప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుంది. ఈ విషయాన్ని గమనించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి రూపకల్పన చేశారు. నగరం, పట్టణం నుంచి మారుమూల గ్రామాల వరకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యులతో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులతో సేవలందించారు. కేవలం వైద్య పరీక్షలే కాకుండా రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, ఈసీజీ, గుండె పరీక్షలు, కిడ్నీ పరీక్షలను సైతం ఉచితంగా చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య భరోసా కల్పించారు. ఇదంతా ఆరు నెలల కిందటి మాట. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజే జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పాటు నిరుపేదలకు ఉపయోగపడే అనేక ఆరోగ్య సంక్షేమ పథకాలను రద్దు చేసింది. దాంతో ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి మెరుగైన చికిత్సలు చేయించుకునే స్తోమత లేక అగచాట్లు పడుతున్నారు.

కానరాని ఉచిత వైద్య సేవలు...

ప్రజలు అనారోగ్యంతో ఇన్ని ఇబ్బందులు పడుతున్నా కూటమి పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. వారంతా చోద్యం చూసేందుకే పరిమితమయ్యారు. ఎన్నికలకు ముందు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆరు నెలల తర్వాత ప్రస్తుతం మళ్లీ క్యాంపులు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం వైఎస్ జగన్ మీద అక్కసుతో ప్రస్తుత సీఎం చంద్రబాబు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు, అమలు చేసిన ఆరోగ్య పథకాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఒంగోలులోని తొమ్మిది అర్బన్ వైద్యశాలల్లోనూ అరకొర సేవలే...

జిల్లాలో 69 పీహెచ్‌సీలు ఉండగా, 150 మందికి పైగా వైద్యులున్నారు. అర్బన్ వైద్యశాలలు మరో 18 ఉండగా, ఒక్క ఒంగోలులోనే 9 వరకు ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటిలోనూ అరకొరగానే సేవలందుతున్నాయి. మార్కాపురంలో జిల్లా వైద్యశాలతో పాటుగా గిద్దలూరు, యర్రగొండపాలెంలో ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు వైద్యశాలలకు పరిగెడుతున్న ప్రజలు...

కూటమి ప్రభుత్వం పుణ్యమా అని సర్కార్ వైద్యం అటకెక్కింది. దీంతో రోగం వస్తే చాలు.. ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు పరిగెత్తాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేటు వైద్యం ఖర్చులు భరించే స్తోమత లేని ప్రజలు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి ప్రాణంమీదకు తెచ్చుకుంటున్నారు. అనివార్యంగా అప్పోసొప్పో చేసి ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. ఇక్కడ జ్వరం వస్తే రక్త పరీక్షలకే కనీసం 2 వేల రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇక, చికిత్స పూర్తయ్యేసరికల్లా కనీసం రూ.10 వేలకుపైగా వదులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ వ్యాధి వస్తే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయంటూ ప్రైవేటు వైద్యులు దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో జనం సతమతం...



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయ్యాయి. ఇటీవల కాలంలో రాష్ట్రంలో వరుసగా తుఫాన్‌లు వచ్చాయి. రోజుల తరబడి వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు ప్రజలపై దాడి చేశాయి. ప్రాణాంతకమైన డెంగీ చాపకింద నీరులా ప్రబలింది. జిల్లాలో ఇప్పటి వరకు 300 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. చికున్‌గున్యా తిరగబెట్టింది. జిల్లాలోని సంతనూతలపాడు, చీమకుర్తి, దర్శి ప్రాంతాల్లోని ప్రజల్లో అధికంగా చికున్‌గున్యా లక్షణాలు కనిపిస్తున్నాయి. విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఇంటికొకరు చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. సీజనల్‌గా జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు బాగా ఇబ్బంది పెడుతున్నాయి. చిన్నారులు, పెద్దలను డయేరియా ఇబ్బంది పెట్టింది. అయినప్పటికీ పాలకులలో చలనం లేదు. ఎక్కడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వైద్యారోగ్య శాఖ, పంచాయతీ, గ్రామీణ నీటి శాఖలలో సమన్వయం కొరవడింది. గ్రామ పంచాయతీలకు కోట్ల రూపాయల నిధులు పారుతున్నాయని అనుకూల మీడియాలో పాలకులు ప్రచారం చేసుకుంటున్నప్పటికీ గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లిన దాఖలాలు లేవు. దానిపై గ్రామ సర్పంచ్‌లే వాపోతున్నారు. దోమలు విపరీతంగా పెరిగి పలు ప్రాంతాల్లో ప్రజలు మలేరియా బారినపడి అల్లాడిపోయారు.

చుండూరిని కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



చుండూరు రవిబాబుతో గుర్రం సుబ్బన్న, తదితరులు



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న బొట్ల సుబ్బారావు, నగరికంటి శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: నూతనంగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షునిగా ఎంపికైన నగరికంటి శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో రవిబాబును సన్మానించారు. అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులను చుండూరు రవిబాబు, పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీలో తగిన గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందన్నారు. మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇచ్చిన హామీలను సమర్థవంతంగా నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, నాయకులు రొండా అంజిరెడ్డి, చావలి శివ, కఠారి ప్రసాద్, ముల్లంగి రవీంద్రరెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, సాధం విజయలక్ష్మి, కోటి యాదవ్, ఫణిదపు సుధాకర్, నటారు జనార్దనరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, పిగిలి శ్రీనివాసరావు, సాధం విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చుండూరి రవిబాబును కలిసిన రజక సంఘ నాయకులు...

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రజక సంఘ నాయకుడు గుర్రం సుబ్బన్న, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని రవిబాబు వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, ఒగ్గులగుంట పరిరక్షణ కమిటీ నాయకుడు పాదర్తి ఆంజనేయులు, అపార్టుమెంట్ వాచ్‌మెన్ల అసోసియేషన్ నాయకుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలు తొలగించడం అన్యాయం

ఒంగోలు టౌన్: పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 106 మంది మేస్త్రీలు ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డారని, వారి కుటుంబాలు అర్ధాకలితో వేదనకు గురవుతున్నాయని, కనికరం చూపాలని పారిశుధ్య కార్మికులు వేడుకున్నారు. శుక్రవారం నాలుగో రోజు నిరాహార దీక్షలను కొనసాగించిన కార్మికులు.. నగరంలోని ఐదు డివిజన్లలో గల మస్టర్ పాయింట్ల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఈ నెల 7వ తేదీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. మిమ్మల్ని విధుల్లోకి తీసుకుంటాను, మీ వివరాలు ఇవ్వండని ఎమ్మెల్యే చెప్పారని, కానీ, ఇంతవరకు అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులను కనీసం పలకరించిన వారు లేకుండా పోయారని చెప్పారు. నగరానికి మంత్రులు వచ్చినా, ఎమ్మెల్యేలు వచ్చినా అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా కాపలా కాసే మేస్త్రీలను తొలగించి వారి కుటుంబాల పొట్టగొట్టడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో టి.విజయమ్మ, లక్ష్మీకాంతం, రత్నకుమారి, దుర్గారావు, నరసింహారావు, మోహన్, సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మస్టర్ పాయింట్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



గాదెపాలెంలో రెవెన్యూ సదస్సులో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



కె.పల్లెపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపట్నం: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. రెవెన్యూ సదస్సుల ఆకస్మిక తనిఖీలో భాగంగా శుక్రవారం కొత్తపట్నం మండలంలోని గాదెపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సంబంధిత సమస్యల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌సెల్‌లో ఎక్కువ అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని, ఆ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులను రెవెన్యూ సదస్సుల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుల్లో కుల ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్స్, ఇన్‌కమ్, తదితర సర్టిఫికెట్లు కూడా దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె చేతుల మీదుగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ మధుసూదన్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లను పరిశీలించిన కలెక్టర్...

రెవెన్యూ సదస్సు అనంతరం మండలంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా కొత్తపట్నం కె.పల్లెపాలెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించి పనులపై ఆరా తీశారు. కె.పల్లెపాలెంలో రూ.2.06 కోట్లతో 4.53 కిలోమీటర్ల మేర 46 పనులు చేపట్టడం జరిగిందన్నారు. అందులో 2.12 కిలోమీటర్ల మేర 20 పనులు పూర్తి చేశామని కలెక్టర్‌కు పంచాయతీరాజ్ ఈఈ కోటేశ్వరరావు వివరించారు. నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఎంత ఇసుక వేస్తున్నారు, సిమెంట్ ఎంత పడుతుందని కలెక్టర్ తెలుసుకుని స్వయంగా పరిశీలించారు. మిగిలిన పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ జోసఫ్ కుమార్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

23న జాబ్‌మేళా

సంతనూతలపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ – జిల్లా ఉపాధి కార్యాలయం, మహిళా ప్రాంగణం సంయుక్త అధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సంతనూతలపాడు మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో 2 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ తెలిపారు. ఇన్ఫోసెవెన్ సొల్యూషన్స్, పేటీఎం కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ షేక్ బాషా (9963005209)ను సంప్రదించాలని సూచించారు.

దళిత దివ్యాంగురాలి ఇంటికి విద్యుత్ కట్



బాధితురాలు కందుల రమాదేవి

సంతనూతలపాడు: విద్యుత్ బిల్లుల పాత బకాయిలు 2023 నాటివి పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే ఓ దళిత దివ్యాంగురాలి ఇంటికి నిర్దాక్షిణ్యంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంతనూతలపాడు మండలంలోని కామేపల్లివారిపాలెం ఎస్సీకాలనీలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. స్థానికంగా నివాసం ఉంటున్న కందుల రమాదేవి అనే దివ్యాంగురాలు ఇంటికి శుక్రవారం విద్యుత్ శాఖ అధికారుల బృందం వచ్చింది. పాత బకాయిలు రూ.1,800 పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని చెప్పి విద్యుత్ సరఫరా కట్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకం ద్వారా రమాదేవి లబ్ధిపొందారు. కానీ, 2023 ఏడాదిలోని ఒక నెలలో విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చిందని, ఆ మొత్తం రూ.1,800 వెంటనే చెల్లించాలని విద్యుత్ అధికారులు చెప్పడంతో ఆమె విస్తుపోయారు. తర్వాత చెల్లిస్తామని చెప్పినా వినకుండా విద్యుత్ కట్ చేయడంతో కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె సమీప బంధువులు వెంటనే సంతనూతలపాడు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ప్రస్తుతం రూ.500 చెల్లిస్తామని, మిగతావి తర్వాత చెల్లిస్తామని చెప్పినా కూడా అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని వినతి

నాగులుప్పలపాడు: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో వీఓఏలుగా పనిచేస్తున్న నూరుబాషా నాగూరమ్మ, రాచూరి మాధవిలు తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ వై.మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నాగూరమ్మ తిమ్మసముద్రం గ్రామైక్య సంఘం, మాధవి శ్రీషిరిడీ సాయిబాబా గ్రామైక్య సంఘంలో కొన్ని సంవత్సరాలుగా వీఓఏలుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ కారణాలతో తమను తొలగించారని, జీవనాధారం కోల్పోయి గత్యంతరం లేక హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్ వేశామని తెలిపారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ మండల ఏపీఎం తమను విధుల్లోకి చేర్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వారి వెంట సీపీఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ ఉన్నారు.

పోలీసు పోస్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



పోలీసు పోస్టు తొలగించిన అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహం

ఒంగోలు టౌన్: నగరంలోని ముంగమూరు రోడ్డు జంక్షన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన పోలీసు పోస్టును శుక్రవారం తొలగించారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. తక్షణమే అక్కడి నుంచి పోలీసు పోస్టును తొలగించారు. దీంతో పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు ఒక ప్రకటనలో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనజీవామృతం పంటకు ప్రాణం

ఒంగోలు సిటీ: మట్టిలో సహజ సూక్ష్మ జీవుల పెరుగుదల ద్వారా మట్టికి జీవం వస్తుందని, భూమి నాణ్యత మెరుగుపడి పంటలకు అవసరమైన పోషకాలు సమపాళ్లలో లభించి పంటకు ప్రాణం వస్తుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రాధా సింగమనేని తెలిపారు. శుక్రవారం రైతు సాధికారిక సంస్థ విభాగంలోని డీపీఎంయూ సుభాషిణి ఆధ్వర్యంలో కరవది గ్రామంలో ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు విషయాలను వివరించారు.